@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | శనివారం 8, మార్చి 2025 | పేజీలు: 04



## వరంగల్‌లో లక్షలాది మందితో
# భారీ బహిరంగ సభ

- తెలంగాణ ప్రజల గుండెల్లో నెలువైన తెలంగాణ పార్టీ
- రజతోత్సవ వేడుకల్లో తెలంగాణ సమాజమంతా భాగస్వాములే
- తెలంగాణ సమాజం గర్వించేలా వేడుకలు
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 7:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించినట్లు పార్టీ ఆవిర్భవించి 27 ఏప్రిల్‌కు 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వరం గల్‌లో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించను న్నారు. ఈ సమావేశంలో తెలం గాణ సమాజానికి బీఆర్ఎస్ అందించిన రాజకీయ రక్షణ, పాలనా పరిరక్షణపై చర్చించ డంతో పాటు, గత 14 నెలలు గా కాంగ్రెస్ ప్రభు త్వ పరిపాలనతో ప్రజల్లో పెరిగిన అసం తృప్తిని హైలైట్ చేయనున్నారు. కేసీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న స్వరాష్ట్రం, గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శం గా నిలిచిందని, అయితే ప్రస్తుతం ప్రజలు మోసపోయి గోసపడుతున్నార ని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేడుకలు కేవలం బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే కాకుండా, యావత్ తెలంగాణ సమాజానికి సంబంధించినవని స్పష్టంగా పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రజల పార్టీగా, (మిగతా 2లో..)

## దక్షిణాదిలో బీజేపీకి
# 29 స్థానాలే

- ఆయా రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే డీలిమిటేషన్
- హైదరాబాద్‌తో పోలిస్తే.. గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ దేనికి పనికిరాదు
- న్యూయార్క్, సియోల్ వంటి అద్భుత నగరాలతో హైదరాబాద్ పోటీ పడేలా చేస్తా
- నెలల్లో రూ. 21,000 కోట్లతో రుణమాఫీ
- తెలంగాణ అభివృద్ధి.. గ్లోబల్ స్టాండర్డ్స్
- పార్టీలో అత్యధిక స్వేచ్ఛ ఉంది
- 'ఇండియా టుడే' కాన్‌క్లేవ్'లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 7:

డీలిమిటేషన్ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్'లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు. దక్షిణాదిలో బీజేపీకి తగిన ప్రాతినిధ్యం లేదని రేవంత్ రడ్డి అన్నారు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే, దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలో లేదని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ భాగస్వామిగా ఉందని తెలిపారు. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోందని వెల్లడించారు. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోందని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకే తాము (దక్షిణాది రాష్ట్రాలు) కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. మరో 30 సంవత్సరాలు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏ విధంగా పెరుగుతుందో చూడాలని అన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రోరేటా విధానంలో (మిగతా 2లో..)

## కేంద్రంపై తమిళనాడు సీఎం స్టాలిన్ పోరు

- డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి నష్టమంటూ 7 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ


2



## నేడు ప్రజాభవన్‌లో ఆల్‌పార్టీ
# సమావేశం

- రాష్ట్ర హక్కుల కోసం అన్ని పార్టీల ఏకతాటిపై
- 42% రిజర్వేషన్ కోసం తెలంగాణ ప్రభుత్వం దూకుడు
- తెలంగాణకు రావాల్సిన వాటిపై అఖిలపక్ష తీర్మానం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో కీలక భేటీ

2



## కిడ్నాప్ కేసును
# ఛేదించిన పోలీసులు

- బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

నల్లగొండ, (ఫోకస్‌న్యూస్)-మార్చి 7:

నల్లగొండ ప్రభుత్వ అస్పత్రిలో ఈ నెల 4వ తేదీన కిడ్నాప్‌కు గురైన బాలుడిని టూటౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. (మిగతా 2లో..)

## సమగ్ర కుటుంబ సర్వేపై
# నిపుణుల కమిటీ..



- సామాజిక న్యాయానికి పునాది
- సమాజ హితం కోసం కీలక అడుగు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 7:

తెలంగాణలో సామాజిక న్యాయానికి బలమైన పునాది వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే (ఆర్థిక, రాజకీయ, విద్య, సామాజిక, న్యాయ) మరింత ఖచ్చితంగా, నిర్దిష్టంగా అమలు కావడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ సమగ్ర సర్వే ద్వారా రాష్ట్రంలోని ప్రజల ఆర్థిక, విద్య, రాజకీయ, సామాజిక స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన విధానాలను అమలు చేస్తోందని ఆయన తెలిపారు. సర్వే ప్రక్రియను పూర్తిగా నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు, నిపుణుల సహకారం తీసుకోవడం ముఖ్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే స్వతంత్ర హోదాలో ఒక సలహా కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ (తరువాయి 2లో..)



## నియోజకవర్గాలు
# ఒక్కటీ తగ్గవు

- మోదీ నాయకత్వంలో త్వరలో జనగణన
- వచ్చే పార్లమెంట్ నాటికి మహిళా రిజర్వేషన్లు
- వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలు అవుతాయి
- మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కిషన్ రెడ్డి

2

# అర్హులకు రేషన్‌కార్డులు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఖమ్మం, (నేటి ఫోకస్‌న్యూస్)-మార్చి 7:

అర్హులైన వారికి తప్పకుండా రేషన్ కార్డులు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని 15 నెలలు అయ్యిందని తెలిపారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను కొన్ని పూర్తి చేశాం, మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇచ్చే కార్యక్రమం వారంలో ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్ర (మిగతా 2లో..)

# దక్షిణాదిలో బీజేపీకి 29 స్థానాలే..

(మొదటి పేజీ తరువాయి..)

సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని వెల్లడించారు. బిహార్, యూపీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ధి జరుగుతుందని ఆయన అన్నారు. తెలంగాణ అభివృద్ధి నమూనాను టీ20 ఫార్మాట్‌తో పోల్చారు. గుజరాత్ మోడల్‌ను టెస్ట్ క్రికెట్‌గా అభివర్ణిస్తూ, తెలంగాణ మోడల్ వేగవంతమైన, సమర్థవంతమైన అభివృద్ధిని ప్రతిబింబిస్తుం దన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "మేము పొరుగు రాష్ట్రాలతో పోల్చుకోవడం లేదు. న్యూ యార్క్, టోక్యో, సియోల్ వంటి అంతర్జాతీయ నగరాలతో పోటీ పడుతున్నాం" అని స్పష్టం చేశారు. "అహ్మదాబాద్, హైదరాబాద్ మధ్య ఎలాంటి పోలిక లేదు" అంటూ 3,000 ఎకరా ల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. "ఇంకో ఐదేళ్లలో హైదరాబాద్ ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా అవతరిస్తుంది" అని హామీ ఇచ్చారు. హైదరా బాద్ అభివృద్ధి కేవలం ఇటీవలి సీఎంల కార ణంగా జరుగుతుందని భావించడం తప్పుడు అర్థం చేసుకోవడం అవుతుందని ఆయన పేర్కొ న్నారు. "కులీ కుతుబ్ షాహి పాలన నుంచి నిజాం రాజులు, బ్రిటిషర్లు, స్వాతంత్ర్యం అనం తరం కాంగ్రెస్ నేత మర్రి చెన్నారెడ్డి, చంద్ర బాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్, ఇప్పుడు నేను – ఇలా నిరంతర అభివృద్ధి జరుగుతోంది" అని వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనపై రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. "గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ఇన్వెస్టర్లకు ఇచ్చే మినహాయింపులు హైదరాబాద్‌కు ఎందుకు అందుబాటులో లేవు?" అని ప్రశ్నించారు. "ప్రభుత్వాలు వేరు, పార్టీలు వేరు. దేశ ప్రధానిని గౌరవించడం నా బాధ్యత. కానీ పాలసీల పరంగా మేము విభేదించవచ్చు" అని స్పష్టం చేశారు. రైతులకు మద్దతుగా 3 నెలల్లో రూ. 21,000 కోట్ల రుణమాఫీని అమలు చేశామని తెలిపారు. డీలిమిటేషన్ ప్రక్రియ దక్షిణాదికి అన్యాయం చేస్తోందని ఆరోపించారు. "సౌత్ స్టేట్స్ నియంత్రణతో ఉన్నా, ఇప్పుడు జనాభా ప్రకారం నియోజకవర్గ విభజన తప్పుడు విధానం" అని విమర్శించారు. "హిందీ జాతీయ భాష కాదు, కేవలం ఎక్కువ మంది మాట్లాడే భాష మాత్రమే" అని పేర్కొంటూ, "భాష విషయంలో బలవంతం సరికాదు. హిందీతో పాటు తెలుగు వంటి భాషలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి" అని అభిప్రాయపడ్డారు. "సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌ల నుంచి తెలుగు భాషను తొలగించడాన్ని బీజేపీ సమర్థించగలదా?" అని నిలదీశారు. రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు ఒక గంట ముందే ఇంటికి వెళ్లే అవకాశంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, "ప్రభుత్వ విధానం అన్ని మత విశ్వాసాలను గౌరవించటమే" అని అన్నారు.

## కేంద్రంపై తమిళనాడు సీఎం పోరు

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను 1971 జనాభా లెక్కల ఆధారంగా చేపట్టాలని డిమాండ్ చేస్తోన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటంం తీవ్రం చేశారు. ఇతర రాష్ట్రాల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమతో కలిసి రావాలని 7 రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ కోరారు. ఈ మేరకు వారికి లేఖలు రాసినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో సహా కేరళ, కర్ణాటక, బంగాల్, పంజాబ్, ఒడిశా ముఖ్యమంత్రులకు స్టాలిన్ లేఖ రాశారు. డీలిమిటేషన్ కసరత్తుకు వ్యతిరేకంగా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు స్టాలిన్ ప్రకటించారు. స్టాలిన్ ఈ నెల 22న చెన్నైలో జరిగే తొలి సమావేశానికి హాజరుకావాలని 7 రాష్ట్రాల సీఎంలను ఆహ్వానించారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి సీఎంకు కూడా ఆహ్వానం పంపారు. ఇంకా జనసేన, బీఆర్ఎస్, వైసీపీతోపాటు ఆయా రాష్ట్రాల్లోని మిగితా రాజకీయ పార్టీలను కూడా జేఏసీ భేటీకి ఆహ్వానించారు. ఇటీవల జరిగిన అఖిలపక్షంలో చేసిన తీర్మానం ఆధారంగా లేఖలు రాసినట్లు స్టాలిన్ చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల భవిష్యత్తు రక్షకులుగా కలిసి నిలబడదామని స్టాలిన్ పిలుపునిచ్చారు. డీలిమిటేషన్ అనేది సమాఖ్యవాదంపై కేంద్రం చేస్తున్న దాడిగా అభివర్ణించారు.



# సమగ్ర కుటుంబ సర్వేపై నిపుణుల కమిటీ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

తెలంగాణలోని ప్రజాభవన్‌లో నేడు (శనివారం) ఉదయం 11 గంటలకు ఆల్ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారాన్ని ప్రధాన అంశంగా ఈ భేటీ జరుగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం జరుగుతుండగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా తెలంగాణకు చెందిన ఎంపీలందరికీ ఆహ్వానం పంపించారు. భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి ఎంపీలను సమావేశానికి హాజరయ్యేలా ఆహ్వానించారు. ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం (గురువారం) జరిగిన కేబినెట్ భేటీలో తీసుకున్నారు. జానారెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ఇతర పెండింగ్ అంశాలపై అఖిలపక్షంగా ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు సభలో తీర్మానం చేయడంతో పాటు, కమిటీ సభ్యులు అన్ని పార్టీ ఎంపీలను సంప్రదించి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ పెంచే ప్రతిపాదనను సిద్ధం చేసింది. డ్రాఫ్ట్ బిల్లు కేబినెట్ ఆమోదం పొందింది. ఈనెల 12 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించి, కేంద్రానికి పంపించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. షెడ్యూల్ 9లో మార్పులు చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచేలా కేంద్రాన్ని ఒప్పించేందుకు ఈ సమావేశాన్ని ఉపయోగించనున్నారు. అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వం కోరుతోంది. నేటి సమావేశంలో ఎంపీలు ఏకతాటిపైకి రావాలని, రాష్ట్ర హక్కుల కోసం ఢిల్లీలో పోరాటం చేపట్టాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది.



# నియోజకవర్గాలు ఒక్కటీ తగ్గవు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

త్వరలోనే మోదీ నేతృత్వంలో జన గణన జరగబోతుందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరగబోతుం దన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి మహిళల రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు. ఇప్పుడున్న స్థానాల్లో ఏ ఒక్క సీటు తగ్గకుండా అసెంబ్లీ, లోక్ సభ స్థానాల పునర్విభజన జరుగుతుందని వెల్లడించారు. కావాలనే ఇక్కడున్న రేవంత్ సర్కార్.. బీఆర్ఎస్, డీఎంకే పార్టీలు తప్పుడు ప్రచారాలు ఖచేస్తున్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఏ ఒక్క సీటును కూడా తగ్గించే ఆలోచన తమకు లేదని చెప్పారు. కొంతమంది దక్షిణ భారతంలో ఆల్ పార్టీ మీటింగ్ అంటూ హడావుడి చేస్తున్నారు.. జనాభా లెక్కల సేకరణ చేస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెఇప కార్యాలయంలో జరిగినకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి.. అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ స్థానాల్లో ఒక్కటి కూడా వదిలిపెట్టవద్దు.. కుటుంబ రాజకీయాలు వద్దు.. ఇది మంచి సంప్రదాయం కాదని కిషన్ రెడ్డి సూచించారు. మహిళను శక్తిగా కొలిచే సంప్రదాయం ఒక్క భారత్‌లోనే ఉందని అన్నారు. ఇంటిని నడిపే మాతృమూర్తి మహిళ అని పొగిడారు. పార్టీలో ఎలాంటి బాధ్యతలు ఇచ్చిన అద్భుతంగా మహిళా మోర్చా నేతలు పని చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా మహిళలు బాగా పని చేశారు.. దేశ సరిహద్దుల్లో రక్షణ విభాగంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యధిక మహిళా పైలట్లు ఇండియాలో ఉన్నారు.. ముస్లిం మహిళల కోసం ట్రిపుల్ తలాక్ రద్దు చేసిన ప్రభుత్వం మోదీది అని కిషన్ రెడ్డి తెలిపారు. ప్రసూతి సెలవులు 26 వారాలకు పొడిగించిన ఘనత మోదీ సర్కార్‌ది అన్నారు. కొత్త పార్లమెంట్ భవనంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు బిల్లునే ఆమోదించారని పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి మొద్దు నిద్ర వీడాలి

- కాంగ్రెస్, బీజేపీ నిర్లక్ష్య ధోరణి.. తెలంగాణ నీటి ప్రయోజనాలకు ప్రమాదం
- చంద్రబాబును అడ్డుకునే ధైర్యం రేవంత్‌కు లేదా?
- మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న జలదోపిడీపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా జలాలను తరలించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కుట్ర పన్నుతుండగా, రేవంత్ రెడ్డి ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. గోదావరి వరదనీటిని తరలిస్తున్నామన్న ఏపీ నీటి పారుదల శాఖ మంత్రి వ్యాఖ్యలపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని హరీశ్ రావు నిలదీశారు. మూడునెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి ఏపీ రోజుకు 10వేల క్యూసెక్కుల నీటిని తరలించుకుంటున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనం పాటిస్తోందని విమర్శించారు. తెలంగాణకు నష్టం లేదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టంగా చెబుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఏ చర్యలు తీసుకోలేదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. "తెలంగాణ నీటి హక్కులను కాపాడే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా? బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఎందుకు స్పందించట్లేదు? చంద్రబాబుతో రేవంత్ బీజేపీ తనం కొనసాగిస్తూ, తెలంగాణను వంచనకు గురిచేస్తున్నారా?" అని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాడుతుంటే, కాంగ్రెస్, బీజేపీ మాత్రం మౌనం పాటించడం ఆందోళన కలిగిస్తోందని హరీశ్ రావు అన్నారు. కనీసం ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వం చేపడుతున్న జలదోపిడీని అడ్డుకోవాలని, కేంద్రాన్ని నిలదీయాలని, రేవంత్ సహా బీజేపీ నాయకులు స్పందించాలని కోరారు.



# నేడు అఖిలపక్ష భేటీ

- ప్రజాభవన్ వేదికగా భట్టి అధ్యక్షతన సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న సిఎం రేవంత్
- కిషన్ రెడ్డి, బండి తదితరులను ఆహ్వానించిన భట్టి

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

పార్లమెంట్ మలివిడత సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో పెండింగ్ సమస్యలపై గళమెత్తేందుకు ఎంపిలు ఏకతాటిపై నడవాలని ప్రభుత్వం కోరుకుంటోంది. ఈక్రమంలో ప్రజాభవన్‌లో శనివారం అఖిలపక్ష ఎంపీల సమావేశం ఏర్పాటు చేసి, అన్ని పార్టీలకు ఆహ్వానం పంపించింది. కేంద్రంలో పెండింగ్ సమస్యల పరిష్కారం ఎంజెడాగా ఈ సమావేశం జరుగనుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. అలాగే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లకు ఆహ్వానం పంపారు. అలాగే తెలంగాణ ఎంపీలందరికీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి ఆహ్వానించారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలోనే నిర్ణయించారు. జానారెడ్డి, భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీని వేసి ఈసమావేశాన్ని నిర్వహించి రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన వాటాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై అఖిలపక్షంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా కేబినెట్‌లో తీర్మానం చేయడంతో పాటు భట్టి, జానా నేతృత్వంలో కమిటీని కూడా వేసింది. వెంటనే రంగంలోకి దిగిన కమిటీ.. స్వయంగా అన్ని పార్టీలకు సంబంధించిన ఎంపీలకు భట్టి ఫోన్‌లు చేసి సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఆల్ పార్టీ ఎంపీల సమావేశం నిర్వహించనున్నారు. భట్టి, జానారెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి కూడా హాజరుకానున్నారు. బీజేపీకి సంబంధించిన ఎంపీలను కూడా సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందులో ప్రధానంగా కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు కూడా ఆహ్వానాన్ని పంపారు. స్వయంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి వారిని సమావేశానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. పార్లమెంటులో తెలంగాణ నుంచి బిజెపికి 8, కాంగ్రెస్‌కు 8మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారు. అలాగే ఎఐఎం నుంచి అసదుద్దీన్ ఒక్కరే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిఆర్ఎస్‌కు కేవలం రాజ్యసభలో మాత్రమే సభ్యులు ఉన్నారు.

# వరంగల్‌లో 10న భారీ బహిరంగ సభ

(మొదటి పేజీ తరువాయి..)

వారి రాజకీయ అస్తిత్వానికి ప్రతీకగా మారిందని, ప్రస్తుతం ప్రజలు అనేక కష్టాల్లో ఉన్నప్పుడు వారి రక్షణకు బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మిన ప్రజలు, ఇప్పుడాయే ప్రభుత్వం వారి ఆకాంక్షలను తీర్చలేదని గ్రహించి, బీఆర్ఎస్‌ను తిరిగి ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. బహిరంగ సభ విజయవంతం చేయడానికి నియోజకవర్గాల వారీగా కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, అనంతరం పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత పటిష్టం చేయనున్నట్లు తెలిపారు. అలాగే, యువత, మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్న తీరు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్లుతోందని, దీన్ని ప్రజలకు మరింత స్పష్టంగా తెలియజేసి, ప్రజల్లో చైతన్యం పెంచాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు కార్యాచరణను సమగ్రంగా రూపకల్పన చేయాలని, తద్వారా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగాలని కేసీఆర్ సూచించారు.




# మార్చ్ 10 నుంచి గ్రూప్స్ రిజల్ట్

- గ్రూప్ ఫలితాలు, కొత్త నోటిఫికేషన్లకు మార్గం సుగమం
- ఉద్యోగ నిరీక్షణ ముగిసే సమయం ఆసన్నం


హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పలు కీలక ఉద్యోగ పరీక్షల ఫలితాలను ప్రకటించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 10న గ్రూప్ 1 ఫలితాలు విడుదల చేయనున్నట్టు అధికారిక ప్రకటనలో వెల్లడించింది. ఇక మార్చి 11న గ్రూప్ 2 పరీక్షల జనరల్ ర్యాంకింగ్స్, మార్చి 14న గ్రూప్ 3 జనరల్ ర్యాంకింగ్స్ విడుదల చేయనున్నది. అదేవిధంగా, మార్చి 17న హాస్టల్ వెల్ఫేర్ అధికారి, 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ ఫలితాలను ప్రకటించనుంది. రాష్ట్రంలో 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీ కోసం 21,093 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్ష రాయగా, వారి స్కోర్ల ఆధారంగా 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితా విడుదల చేసేందుకు చర్యలు ప్రారంభించింది. తాజాగా జరిగిన క్యాబినెట్ సమావేశంలో కొత్త ఉద్యోగ అవకాశాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, పెండింగ్‌లో ఉన్న నోటిఫికేషన్లు త్వరలో విడుదల చేయనున్నట్టు సమాచారం. అలాగే, ప్రభుత్వం మరిన్ని ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు ప్రారంభించింది.

# కేవలం కొంతమందికే నిధుల మంజూరు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నేడు హైదరాబాద్‌లోని నాంపల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలాగే వ్యవహరిస్తోందని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం మూడు నియోజకవర్గాలకు మాత్రమే నిధులు మంజూరు చేసేదని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతుందన్నారు. పాలనలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తేడా ఏమీ లేదని పేర్కొంటూ, సీఎం రేవంత్ రెడ్డి తన మంత్రుల నియోజకవర్గాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. ఈ విధానం కొనసాగితే మిగతా నియోజకవర్గాల అభివృద్ధి ఏమవుతుందని ప్రశ్నించిన మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సాగునీటి ప్రాజెక్టులపై చిత్తశుద్ధి లేదని అన్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ, ఇప్పటి వరకు చనాఖా–కొరటా ప్రాజెక్టును పట్టించుకోలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు.




# తెలంగాణలో భారీగా ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)–మార్చి 7:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 21 మంది ఐపీఎస్ అధికారులకు స్థాన చలనం కల్పించింది. బదిలీ అయిన అధికారుల్లో ఒక అదనపు డీజీ, ఇద్దరు ఐజీపీలు, ఇద ్దరు డీఐజీలు, 14 మంది ఎస్పీలు, అలాగే ఇద్దరు నాన్ క్యాడర్ ఎస్పీలు ఉన్నారు. ఈ మేరకు కొత్త నియామకాలు జరిగాయి. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా గౌస్ ఆలం నియమితులయ్యారు. అదనపు డీజీ (పర్సనల్)గా అనిల్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయనకు ఎస్పీఎఫ్ డైరెక్టర్‌గా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఐడీ డీజీగా ఎం. శ్రీనివాసులు నియమితులయ్యారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్, నిజామాబాద్ కమిషనర్‌గా సాయి చైతన్య, రామగుండం కమిషనర్‌గా అంబర్ కిషోర్ నియామకం జరిగింది. ఇంటెలిజెన్స్ ఎస్పీగా సింధు శర్మ నియమితులయ్యారు. భువనగిరి డీసీపీగా అకాంక్ష యాదవ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. మహిళా భద్రతా విభాగం ఎస్పీగా చేతన, నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా రూపేష్ నియమితులయ్యారు.

# కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి..)

జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని టూటౌన్ పోలీసులకు మార్గదర్శనం చేస్తూ చేధిచారు. ఎస్పీ పవార్ తెలిపిన వివరాల ప్రకారం బాలుడి తల్లి, ఫిర్యాదుదారు అయిన షమీమున్నీసా గత మూడేళ్ల నుంచి తన భర్త మహ్మద్ అహ్మద్, తన ఇద్దరు పిల్లలు.. కొడుకు అబ్దుల్ రహ్మాన్ (3), కూతురు అలీన (5) లతో కలిసి కడు పేదరికంతో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నివాసం ఉంటున్నారు. ఆమె భర్త పెయింటింగ్ పనికి వెళ్తూ కుటుంబ అవసరాలు తీరుస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన సాయంత్రం 4 గంటలకు బాలుడు అబ్దుల్ రహ్మాన్ ఆసుపత్రి ఆవరణలో ఐస్ క్రీమ్ బండి దగ్గర ఆడుకుంటుండగా నార్కట్‌పల్లి మండలం మాంద్ర గ్రామానికి చెందిన రాపోలు సీతారాములు (40) ఆ బాలుడిని మచ్చిక చేసుకుని మాయమాటలు చెప్పి, కిడ్నాప్ చేసి తీసుకుపోయాడు. బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు ప్రక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించక పోవడంతో నల్లగొండ టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాప్ కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ నాగరాజు వెంటనే రంగంలోకి దిగారు. జిల్లా శరత్ చంద్ర పవార్ కూడా బాలుని ఆచూకీ కోసం ఆరు పోలీస్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నల్లగొండ టూ టౌన్ సీఐ రాఘవరావు పర్యవేక్షణలో బాలుడి ఆచూకీ కనుగొన్నారు. నల్లగొండ టూ టౌన రావుల నాగరాజు తన సిబ్బంది సాగర్ల శంకర్, లావూరి బాలకోటి, జానకి రామ్‌తో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలోని టీవీ కెమెరాలు పరిశీలించి నేరస్థుడిని గుర్తించారు. నేరస్తున్ని పట్టుకుని విచారించగా అతని చిన్నమ్మ కూతురు ముద్దముల అరుణకు ముగ్గురు కూతుర్లు జన్మించారని, మగ సంతానం లేకపోవడంతో ఆమె కోసం బాలుడిని కిడ్నాప్ చేసినట్టు ఒప్పుకున్నాడు. దాంతో పోలీసులు అరుణ నుంచి బాలుడిని తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

# రాజీవ్ నగర్ కాలనీ సమస్యలపై ఉద్యమిస్తాం





**- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశనాయక్**

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మార్చి 07

అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీ సమస్యలను తక్షణమే అధికారులు స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశనాయక్ కోరారు. అచ్చంపేట పట్టణంలో ఈరోజు కాలనీ ప్రజలతో మాట్లాడి ప్రజల యొక్క సమస్యలను సర్వే చేస్తూ వారి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాజీవ్ కాలనీలో సీసీ రోడ్డు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు.

తాగునీరు లేక కిలోమీటర్ దూరం పోయి తెచ్చుకుంటున్నారని వారు గుర్తు చేశారు రాత్రి సమయంలో కరెంటు లేక విషపురుగులతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని కాలం వెలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కొంతమందికి ఇల్లు లేక గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని వారు అన్నారు.

నిరుపేదలకి ఇండ్లు పట్టాలు ఇచ్చే ఆదుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .రాజీవ్ నగర్ కాలనీ ఉన్నత అధికారులు వెళ్లి సమస్యలు తెలుసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని వారు డిమాండ్ చేశారు లేకపోతే ప్రభుత్వ కార్యాలయం ముందు ప్రజలతో ధర్నా నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సైదులు నిర్మల సీనియర్ నాయకులు రాములు శివకుమార్ నాయకులు మధు శివ శంకరయ్య రేణమ్మ కాలనీ వాసులు పాల్గొన్నారు



# కల్లు తాగిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు మార్చి 7

దేవరుప్పుల మండలం మన్ పహాడ్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దావుల వెంకన్న-విజయ కుమారుడు గణేష్-శరణ్య వివాహం నిన్న జరుగగా ఈరోజు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారి ఇంటికి వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించిననంతరం తిరిగి వెళుతుండగా మాజీ మంత్రిని పిలిచి కల్లు తాగాలని టిఆర్ఎస్ ఉద్యమకారుడు కోల సోమయ్య గౌడ్ కోరగా అభిమాని కోరిక మేరకు తాటికల్లు తాగి తన అభిమానాన్ని చాటుకున్నారు. వారి వెంట మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్,చింత రవి,గ్రామ శాఖ అధ్యక్షుడు బస్వ సోమనర్సయ్య,మాజీ సర్పంచ్ వర్రే మధు,మండల,గ్రామ బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులున్నారు.

# ‘ఓ మగువా! నీ త్యాగం మరువలేనిది’

పెద్ద వంగర నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు మార్చి 7



ప్రపంచాన్ని సుందరంగా మార్చే స్ఫూర్తి నువ్వే, ఓ మగువా! నీ త్యాగం, నీ ప్రేమ, నీ తపన అసమానమైనవి. ప్రతి ఏడాది మార్చి 8న జరుపుకునే మహిళా దినోత్సవం కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదుబీ అది నీ గొప్పతనాన్ని గౌరవించే ఓ సందర్భం..

**నీ త్యాగం... మరువలేనిది**

అమ్మగా, భార్యగా, చెల్లిగా, కూతురుగా – నువ్వు పోషించే ప్రతి పాత్ర వెనుక నీ అంతులేని త్యాగం ఉంటుంది, ఓ తల్లి తన పిల్లల కోసం రాత్రిం బవళ్లు కష్టపడుతుంది, ఓ భార్య కుటుంబాన్ని ఏకతాటిపై నిలపడానికి ఎల్లవేళలా కృషి చేస్తుంది,ఓ చెల్లి అన్నదమ్ములకు తోడుగా నిలుస్తుంది, ఇలా ప్రతి ఒక్క రూపంలో నువ్వు సమాజానికి వెలకట్టలేని సేవ అందిస్తావు.

విద్య, ఉద్యోగాల్లో నువ్వు ముందుండాలి:

ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మహిళలు అవకాశాల కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. కానీ, నువ్వు నిన్నటి పరిస్థితులకు తలొగ్గకుండా, నేటి సమాజాన్ని మారుస్తూ ముందుకు సాగుతున్నావు. నిస్సహాయతలోనూ ధైర్యాన్ని చూపిస్తున్నావు. విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో దూసుకుపోతున్నావు. నువ్వు సాధిస్తున్న విజయాలు నీ కృషికి నిదర్శనం.

**సమాజంలో మార్పుకు నువ్వే కేంద్రబిందువు:**

ఓ మగువా! నువ్వు మార్పును సృష్టించగలవు. నీ మాటలకు ఆ శక్తి ఉంది. నీ ఆలోచనలకు చైతన్యం ఉంది. సమానత్వం కోసం పోరాడే ధైర్యం నీలో ఉంది. కుటుంబంలో నువ్వు మార్పు తీసుకురాగలిగితే, సమాజాన్ని కూడా మార్చగలవు.

**మహిళా దినోత్సవ సందేశం**

ఈ మహిళా దినోత్సవం రోజు, నీ త్యాగాన్ని గౌరవిద్దాం,సమానత్వం, గౌరవం, స్వేచ్ఛతో నిండి ఉన్న సమాజం కోసం కృషి చేద్దాం. ఈ ప్రపంచాన్ని మరింత అందంగా తీర్చిదిద్దే నువ్వు ఎప్పటికీ వెలుగుగా నిలువాలి, అన్నిట్లో గెలవాలి.

“ఆత్మవిశ్వాసమే నీ ఆయుధం, సంకల్ప బలమే నీ గమ్యం!
ఆత్మగౌరవంతో నువ్వు వేసే ప్రతీ అడుగు నవ భారత నిర్మాణానికి నాంది కావాలి..– జి.అజయ్ కుమార్ కాలమిస్ట్

# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలాగా విద్యార్థులను ప్రోత్సహించాలి



**ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**- పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కు విద్యాధికారులు కృషి చేయాలి**

అచ్చంపేట నియోజకవర్గం నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి ఆర్ భరత్ మార్చి 07

అచ్చంపేట పట్టణంలో జరిగిన అచ్చంపేట నియోజకవర్గ విద్యాభివృద్ధిపై విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అచ్చంపేట నియోజకవర్గంలో రానున్న పదవ తరగతి విద్యార్థుల పరీక్షలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులకు ఎంఈఓ లకు ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశించారు. నియోజకవర్గంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న మౌలిక వసతులైన తాగునీరు, టాయిలెట్లు అలాగే అవసరమైన చోట నూతన పాఠశాల భవనాలు నిర్మాణం చేయుటకు సంబంధించిన విషయాలను ఒక నివేదిక రూపంలో ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ ల ద్వారా నా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే ఆ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేసి



విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు...

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అన్ని మండలాల ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు గెజిటెడ్ హెడ్మాస్టర్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ పాల్గొన్నారు.

# రామ్ రెడ్డి చికెన్ ఆధ్వర్యంలో చికెన్ మరియు ఎగ్ మేళా

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ.**

అచ్చంపేట , నేటి ఫోకస్ న్యూస్






అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి రామ్ రెడ్డి చికెన్ మార్కెట్ వారి ఆధ్వర్యంలో పట్టణంలో చికెన్ మరియు ఎగ్ మేళా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట పట్టణ పరిసర ప్రాంతాలు ప్రజలందరూ కూడా నిర్భయంగా చికెన్ మరియు గుడ్లు దినోత్సవం ఎటువంటి అపోహలు లేవు అని ప్రజల్లో ఉన్నటువంటి భయం తొలగించడానికి అచ్చంపేట పట్టణంలోని రామ్ రెడ్డి చికెన్ వారు చికెన్ మరియు ఎగ్ మేళ నిర్వహించడం జరిగిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి చికెన్ షాప్ యజమాని సంతోష్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి కౌన్సిలర్ గౌరీ శంకర్ కాంగ్రెస్ నాయకులు ఛత్రు నాయక్ ఉమామహేశ్వర దేవస్థానం డైరెక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# “మహిళలు మహారాణులు”



మహబూబాద్ నేటి ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు మార్చి 07

శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సామూహిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జ్ సురేష్ , జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, పరిపాలన అధికారి క్రాంతి కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి టీఎస్ సీపీఎస్ఈ యు రాష్ట్ర కార్యదర్శి షేక్. ముబీన్ అహ్మద్ అధ్యక్షత జరిగినది ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సి సురేష్ మాట్లాడుతూ ఈరోజు మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారని అలాగే మహిళలు దేనికి తక్కువ కాదని వారు కూడా సమాజంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని ఇకముందు ఇంకా అభివృద్ధి బాటలో పయనించి ప్రతి మహిళ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించుకుంటూ మహిళలు సమాజానికి మంచిపేరు తేవాలని మరియు ఉద్యోగులు తమ ఉద్యోగాలను సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు తేవాలని కోరినారు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి మాట్లాడుతూ ఈ రోజు జరుపుకుంటున్న సామూహిక అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు అక్కడ విచ్చేసిన లోక్ ఆదాలత్ క కక్షిదారులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపినారు పరిపాలన అధికారి క్రాంతి కుమార్ తన తండ్రి తాను పది నెలలు ఉన్నప్పుడు స్వర్గస్తులయితే మాతృమూర్తి అయిన అమ్మగారే ఎంతో కష్టపడి నన్ను ఈ స్థాయిలో ఉండడానికి కారణమని అందుకు తన జీవితమే మంచి ఉదాహరణ అని భావోద్వేగంతో చెప్పారు.

ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ అహ్మ ఖాన్ ,ఆర్గనైజింగ్ సెక్రటరీ పూస శ్రీనివాస్, ఝాన్సీ రుచిత స్వాతి సీనియర్ సూపరిండెంట్లు శైలజ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ




నేటి ఫోకస్ న్యూస్, ఉప్పునుంతల

నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల గురించి వాల్ పోస్టర్ విడుదల చేసిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుండి 16వ తేదీ వరకు జరిగే ఉపనితల మండలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు జాతర ను అచ్చంపేట నియోజకవర్గం మరియు నాగర్ కర్నూల్ నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క జాతర ఉత్సవాలను విజయవంతం చేయగలరు అచ్చంపేట పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో గౌరవ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ గ చేతులమీదుగా జాతరకు కరపత్రాలు వాల్పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మామిళ్ళపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు మరియు పాలకమండల సభ్యులు నాయకులు కార్యకర్తలు ఆలయ అధికారులు పూజారులు పాల్గొన్నారు.